
పాయకరావుపేట : భోగి మంటలను కాగుతున్న భక్తులు


తిమ్మరాజుపేట సచివాలయ ప్రాంగణంలో భోగి మంట


కోనవానిపాలెంలో భోగి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


కట్టుపాలెంలో భోగి మంట వేసిన ఓ కుటుంబం

పల్లె లోగిళ్లలో భోగిభాగ్యాలు

కోటవురట్ల : భోగి పండగను ఆదివారం ప్రజలంతా ఆనందోత్సాహలతో జరుపుకొన్నారు. ప్రతి ఇంటా వేకువజామునే భోగి మంట వేసి కుటుంబసభ్యులతో మంట కాగారు. పలు గ్రామాలలో మేలుకొలుపు నిర్వహించి సీతారాముల పల్లకీని ఊరేగించారు. జల్లూరు, పాములవాక, తంగేడు, కైలాసపట్నం గ్రామాల్లో పల్లకీతో నగర సంకీర్తన చేశారు. కోలాటం, చిడతల డ్యాన్సు, శక్తివేషాలు కనువిందు చేశారు. పాములవాకలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భోగి వేడుకలతో పాటు ధనుర్మాసోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు.

తిమ్మరాజుపేటలో ఆకట్టుకున్న తప్పెటగుళ్ల ప్రదర్శన

మునగపాక /రాంబిల్లి: ఆయా మండలాల్లో భోగి పండగ ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. తిమ్మరాజుపేటలో ఉదయం నుంచి ప్రత్యేక గీతాలాపన, భజనలు ఘనంగా నిర్వహించారు. తప్పెటగుళ్ల ప్రదర్శన నిర్వహించారు. మునగపాకలో రైతు సంఘాల ఆధ్వర్యంలో భోగి పండగను చేపట్టారు.

నక్కపల్లి/పాయకరావుపేట/ఎస్.రాయవరం: అర్ధరాత్రి పల్లెల్లో చిమ్మచీకట్లు చీల్చుకుంటూ భోగి మంటలు వెలుగురేఖలను నింపాయి. ప్రజలంతా గోవు పేడతో చేసిన పిడకలను భోగిమంటల్లో వేస్తూ గ్రామానికి పట్టిన దోషం పోవాలని కోరుకున్నారు. బంధుజనంతో పిండివంటలతో గ్రామాలు ఘుమఘుమలాడాయి. భక్తులు అధిక సంఖ్యలో ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు. ధనుర్మాసం పూర్తికావడంతో ఆండాళ్లమ్మ వారిని దర్శించుకుని కుంకుమపూజలు నిర్వహించారు. గోదాదేవి కల్యాణాన్ని తిలకించారు. ఇళ్లల్లో చిన్నారులకు భోగి పళ్లు పోసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కోనవానిపాలెంలో భోగి వేడుకల్లో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పాల్గొన్నారు. ఆవుపేడతో తయారు చేసిన పిడకలను భోగిమంటల్లో వేశారు. నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి, కనుమ పండగల శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు.


పాములవాకలో కనువిందు చేసిన శక్తి వేషాలు


పాములవాకలో ఆకట్టుకున్న కోలాటం


జల్లూరులో పల్లకీ ఊరేగింపు చేస్తున్న భక్తులు


తిమ్మరాజుపేటలో తప్పెటగుళ్ల ప్రదర్శన

నేడు మకర సంక్రాంతి

నక్కపల్లి, : సంక్రాంతి నాడు సూర్యుడు మకర రాశిలో ప్రవేశిస్తాడు. దీనినే మకర సంక్రమణం అంటారు. క్రాంతి అంటే మార్పు... సంక్రాంతి అంటే కొత్త మార్పు. పాడి పంటలు సమృద్ధిగా ఉండే రోజు. ఈ రోజు నుంచే సృష్టిలో కూడా కొత్త మార్పులు వస్తాయి. సంక్రాంతి నాడు చాలా మంది పితృదేవతలకు తర్పణాలు ఇవ్వడం చేస్తారు. అలాగే ఉత్తరాయణ పుణ్యకాల ఘడియల్లో నువ్వులు, బియ్యం కలిపి శివునికి అభిషేకం చేస్తే మంచిదని చెబుతారు. మకరరాశికి శని అధిపతి కాబట్టి ఈరోజున శనీశ్వరునికి ఇష్టమైన నువ్వులు దానం చేస్తే మంచిది. ఈరోజున శివాలయంలో నువ్వుల నూనెతో దీపదానం చేయడం కూడా మంచిదే.

మార్కెట్‌కు సంక్రాంతి కళ...

మార్కెట్‌కు సంక్రాంతి కళ వచ్చింది. భోగి సందర్భంగా పాయకరావుపేట, తుని నక్కపల్లి, అడ్డురోడ్డు ప్రాంతాలు రద్దీగా మారాయి. శనివారం కొనుగోలుదారులతో పాయకరావుపేట, తుని మెయిన్‌రోడ్డు మార్కెట్‌లు కిక్కిరిసి పోయాయి. ముఖ్యంగా వస్త్రదుకాణాలు ఫర్నిచర్, బంగారం, కిరాణాదుకాణాలు విపరీతమైన రద్దీతో కన్పిస్తున్నాయి.సంక్రాంతి పండగ కావడంతో అరెసలు, బొబ్బట్లు, బూరెలు, సున్నుండలు, తదితర పిండి వంటలు కూడా అందుబాటులో ఉంచినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రాంబిల్లి: కొత్తపేటలో ఆదివారం సర్పంచ్ వానపల్లి అరుణలత జగన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. అనంతరం ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సర్పంచ్ చేతులుమీదుగా బహుమతులు అందజేసారు.

వైభవంగా శోభాయాత్ర



రాంబిల్లి : శోభాయమానం గా సీతారాముల శోభాయాత్ర సాగింది. ఆదివారం మర్రిపాలెం , మురకాడ, కట్టుబోలు, దిమిలి, తెరువుపల్లి వరకు సీతారాముల శోభా యాత్ర వైభవంగా సాగింది.

వైభవంగా గోదాదేవి కల్యాణం


కైలాసపట్నంలోని శ్రీరాజగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవంలో భక్తులు


పాయకరావుపేట : పాండురంగ ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం


దార్లపూడి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం


మునగపాక : చూచుకొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం


కొత్తపేట రామాలయంలో...

కోటవురట్ల: కైలాసపట్నంలో వేంచేసి యున్న శ్రీ రాజగోపాలస్వామి వారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలలో భాగంగా గోదాదేవి కళ్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యురాలు ఎక్కిరాల మణికుమారి ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం కమనీయంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, సత్యనారాయణ దంపతులు, ఉప సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : పాయకరావుపేటలో శ్రీరాధారుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానంలో ఆదివారం సాయంత్రం ఆలయ అర్చకులు యియ్యుణ్ణి కృష్ణస్వామి ఘనంగా గోదాదేవి కల్యాణం నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరిసే వెంకటాద్రి పాల్గొన్నారు.

మునగపాక: మునగపాక మండలం చూచుకొండ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం గోదాదేవి కళ్యాణం ఘనంగా జరిగింది. కళ్యాణం తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

ఎస్.రాయవరం : వైభవ వేంకటేశ్వరస్వామి, వమ్మవరం శ్రీ స్వయంభూ వేంకటేశ్వరస్వామి, కొరుప్రోలు శ్రీ సీతారామ స్వామి ఆలయాల్లో గోదాదేవి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దార్లపూడి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు పవన్‌కుమార్ ఆచార్యులు గోదాదేవి కల్యాణం నిర్వహించి భక్తులకు ఉత్సవ మూర్తులు దర్శనం కల్పించారు.

యలమంచిలి రూరల్: కొత్తపేట పురాతన రామాలయంలో శనివారం అర్చకులు గోదాదేవి.విష్ణుమూర్తిని విశేషపుష్పాలతో అలంకరించారు. పలువురు దంపతులు కుటుంబసమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు.భక్తులు పెద్దసంఖ్యలో కల్యాణోత్సవాన్ని తిలకించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు కంబాల జోగులు,గొల్ల బాబూరావు


పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు అందజేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

ఎస్.రాయవరం: పేదలకు సహకారంఅందిస్తే వారు నిత్యం గుండెల్లో పెట్టుకుని చూస్తారని పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పాయకరావుపేట ఎమ్మెల్యేగొల్ల బాబూరావు అన్నారు.గుడివాడ గ్రామంలో శ్రీపతిరాజు ఆర్థిక సహాయంతో చేపట్టి పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమంలో ఇద్దరు ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందజేశారు. కాగా క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయా సర్పంచ్ ధూళి శ్రీనుబాబు,అచ్చుతరామరాజు, వర్మరాజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ

మునగపాక : మునగపాకలో సర్పంచ్ దిమ్మల అప్పారావు పారిశుధ్య కార్మికులకు తన సొంత నిధులతో వస్త్రాలు అందజేశారు. మూలపేటలో సర్పంచ్ గంగప్పలనాయుడు పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

జంపపాలెంలో గుర్రాల పోటీలు


గుర్రాల పరుగు పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

యలమంచిలి రూరల్ : జంపపాలెంలో నూకాలమ్మ తీర్థం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ గుర్రాల పరుగు పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి ఈ పోటీలకు 17 అశ్వాలను తీసుకువచ్చారు. పోటీలు హోరా హోరీగా సాగాయి. రోడవరం మండలం రాయపురాజు పేటకు చెందిన దాడి నూక హనుమంతరావు గుర్రం పోటీల్లో ప్రథం స్థానంలో నిలిచింది. మొదటి బహుమతిగా రూ.12వేలు, దేవరాపల్లికి చెందిన వి.కుమార్ గుర్రానికి రెండో బహుమతిగా రూ.10వేలు, అచ్యుతాపురం మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన గుర్రం రౌతు విక్రమ్‌కు తృతీయ బహుమతిగా రూ.8 వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు. జాతర సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు, భజనలు, కోలాట ప్రదర్శనలు అలరించాయి. సంప్రదాయబద్ధంగా కోడి పందాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. గ్రామ పెద్దలు పాలమరశెట్టి వెంకట్, జంపపాలెం సర్పంచ్ శిలపరశెట్టి దేవకీనాయుడు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పోటీలు


ఉమ్మలాడలో పరుగులు తీస్తున్న ఎడ్లబండి

మునగపాక: భోగిపండగ సందర్భంగా ఉమ్మలాడలో మాజీ సర్పంచ్ కర్రి భాస్కరరావు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే మునగపాకలో మునగపాక బైపాస్ రోడ్డు దరి ఏర్పాటు చేసిన గాలిపటాల పోటీలను జనసేన నియోజకవర్గ కన్వీనర్ సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ముగిసిన ధనుర్మాస ఉత్సవాలు


శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణ స్వామి వారు

రాంబిల్లి : దిమిలి వల్లభనారాయణస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. అర్చకులు నేతేటి రామచంద్రాచార్యులు, గోపాలకృష్ణ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అచ్యుతాపురం: అందలాపల్లిలో ధనుర్మాస ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేలుకొలుపులు ఊరేగింపు జరిపారు. అదేవిధగా భోగి వేడుకలను స్థానికులు ఘనంగా నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళం


వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌కు విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక : స్థానిక శ్రీ వెంకటేశ్వర రామాలయం నిర్మాణానికి మునగపాకకు చెందిన స్వర్గీయ కింతాడ అప్పలనాయుడు మాస్టారు జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యులు రూ.25వేలు, అలాగే వడ్డెర కుల సంక్షేమ సంఘం నుంచి రూ.20వేలు, విశ్రాంత ఉద్యోగి కుంది సూర్యనారాయణ రూ.10 వేలు వెరసి రూ.55వేల విరాళాన్ని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు అందజేశారు.

ఉత్సాంగా ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

ఎస్.రాయవరం : స్థానిక రెల్లి కాలనీల్లో ఆదివారం మహిళలకు కాలనీవాసులు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కాలనీ వాసులతో పాటు గ్రామస్తులు ఉత్సాహంగా రంగు రంగుల ముగ్గులు వేశారు. విజేతలకు సర్పంచ్ భూపతి అప్పారావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

19న కనకమహాలక్ష్మి జాతర


కనకమహాలక్ష్మి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

యలమంచిలి : ఈ నెల 19న కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను విజయవంతం చేసేందుకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు ఆదివారం తెలిపారు. అమ్మవారి ఆలయంలో ఉత్సవాల పోస్టర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు ధర్మవరంలో కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. సంక్రాంతి పండగ పురస్కరించుకుని అమ్మవారికి నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి జనవరి 19న ఘనంగా అమ్మవారి జాతరను నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేపట్టింది. కార్యక్రమంలో కొఠారు సాంబశివరావు, కొఠారు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

16న జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలు

మునగపాక : సంతబయిల అభయాంజనేయస్వామి వారి వార్షికోత్సవాలను ఈ నెల 16న ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మునగపాక బైపాస్ రోడ్డు దరి జిల్లా స్థాయి గుర్రాల పరుగు పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను డాన్‌జిమ్ అధినేత పెంటకోట అజయ్ ప్రారంభించారు. కాండ్రేగుల మణికంఠ, విల్లూరి మోహన్, ఆడారి గోవింద్ పాల్గొన్నారు.

కోడిపందాలపై దాడి

ఎస్.రాయవరం : మండలంలో పోలీసులు ఆదివారం చేసిన దాడుల్లో 24 మంది పేకాటరాయుళ్లను, కోడిపందెం ఆడేవారిని అదుపులోనికి తీసుకుని రూ.27,080 నగదు స్వాధీన పరచుకున్నారు. ఎస్‌ఐ ప్రసాద్‌రావు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో శ్మశానవాటిక వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకుని రూ.10,040 స్వాధీనం చేసుకున్నారు. సర్వసిద్ధి గ్రామంలో నలుగురిని పట్టుకుని రూ.8,300, సైతారుపేట లో ఏడుగురిని అదుపులోనికి తీసుకుని రూ. 2,340, తిమ్మాపురంలో ఆరుగురిని పట్టుకుని రూ.6400 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. జేవీ పాలెం గ్రామంలో కోడిపందాలపై దాడులు నిర్వహించి రెండు కోడిపుంజులు స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అదుపులోనికి తీసుకున్నట్టు చెప్పారు.